దీప్తికి కోటి నజరానా మంజూరు

చెక్ అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన రాష్ట్ర యువ అథ్లెట్ జివాంజీ దీప్తి ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. విశ్వక్రీడల్లో మహిళల 400మీ. టీ20 విభాగంలో మెరిసిన దీప్తికి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కోటి రూపాయల చెక్ అందజేశారు. దీప్తి కోచ్ నాగపురి రమేశ్‌కు 10లక్షలు నగదు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ రాష్ట్రానికి కీర్తి, ప్రతిష్ఠలు తీసుకొచ్చే ప్లేయర్లను కచ్చితంగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. క్రీడారంగంలో సమూల మార్పులు తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెస్ చాంపియన్లకు ఘన స్వాగతం

- **హైదరాబాద్ చేరుకున్న హారిక**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో పసిడి పతకాలతో చరిత్ర సృష్టించిన భారత చెస్ ప్లేయర్లకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. బుడాపెస్ట్(హంగరీ) వేదికగా జరిగిన మెగాటోర్నీలో ఓపెన్ విభాగంతో పాటు మహిళల కేటగిరీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక, దొమ్మరాజు గుకేశ్, వైశాలి, కెప్టెన్ శ్రీనాథ్‌కు సొంతగడ్డపై ఘన స్వాగతం లభించింది. మంగళవారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయంలో హారికకు తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, పలువురు చెస్ క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు అందించి శాలువాతో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాల ద్వారా భారత ప్లేయర్ల సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసివచ్చిందని పేర్కొంది.

మెరిసిన అర్జున్, సరయు

- **జాతీయ జూనియర్ చెస్ టోర్నీ**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హర్యానా వేదికగా జరిగిన జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ ప్లేయర్లు ఆదిరెడ్డి అర్జున్ చాంపియన్‌గా నిలువగా, వేల్పుల సరయు రన్నరప్ సొంతం చేసుకుంది. మంగళవారంతో ముగిసిన టోర్నీలో జూనియర్ కేటగిరీ ఆఖరి పోరులో అర్జున్(8.5)..మాధవేంద్ర ప్రతాప్(8, మధ్యప్రదేశ్)పై విజయంతో టైటిల్ సొంతం చేసుకున్నాడు. మరోవైపు బాలికల విభాగం తుది రౌండ్‌లో సరయు(9)..సంస్కృతి(మహారాష్ట్ర)పై గెలిచింది. అయితే మ్రితిక మాలిక్(9)తో పాయింట్ల పరంగా సమంగా నిలిచిన సరయు టైబ్రేక్ విజయాలతో రన్నరప్ టైటిల్‌కు పరిమితమైంది. జాతీయ జూనియర్ టోర్నీలో రాణించిన అర్జున్, సరయును రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది.

పారా షట్లర్లకు నజరానా

ఢిల్లీ: ఇటీవలే పారిస్ వేదికగా ముగిసిన పారాలింపిక్స్‌లో భాగంగా బ్యాడ్మింటన్‌లో భారత్‌కు ఐదు పతకాలు అందించిన పారా షట్లర్లకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) రూ. 50 లక్షల నగదు రివార్డును ప్రకటించింది. బ్యాడ్మింటన్ క్రీడలో భారత్‌కు ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు దక్కాయి. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 కేటగిరీలో బంగారు పతకం సాధించిన నితేశ్ కుమార్‌కు రూ. 15 లక్షలు దక్కగా వెండి కాంతులు పంచిన సుహాస్ యతిరాజ్ (ఎస్ఎల్ 4), తులసిమతి మురుగేశన్ (మహిళల సింగిల్స్ ఎస్యూ5)కు తలా రూ. 10 లక్షలు అందనున్నాయి. ఇక కాంస్యాలు సాధించిన అమ్మాయిలు మనీషా రామదాస్ (ఎస్యూ5), నిత్యశ్రీ శివన్ (ఎస్హెచ్6)కు తలా ఒక్కరికి రూ. 7.5 లక్షలు దక్కనున్నాయి.

హాంగ్జో చాంప్ జీవన్ జోడీ

చెంగ్డూలో రన్నరప్‌గా యూకీ ద్వయం

ఢిల్లీ: చైనా వేదికగా జరిగిన హాంగ్జో, చెంగ్డూ ఓపెన్స్‌లో భారత టెన్నిస్ ఆటగాళ్లు సత్తా చాటారు. హాంగ్జో ఓపెన్‌లో అన్‌సీడెడ్ భారత ఆటగాళ్లు జీవన్, విజయ్.. 4-6, 7-6(7/5), 10-7తో ఫ్రాంట్జెన్, జెబెన్స్(జర్మనీ)ను ఓడించి డబుల్స్ టైటిల్ సొంతం చేసుకున్నారు. 35 ఏండ్ల జీవన్‌కు ఇది రెండో ఏటీపీ టైటిల్ కాగా విజయ్‌కు ఇదే మొదటిది. తొలి సెట్‌లో ఓడినా తర్వాత పుంజుకున్న భారత ద్వయం రెండో సెట్‌ను టైబ్రేక్‌తో గెలుచుకుంది. మూడో సెట్‌లో ప్రత్యర్థులు పోరాడినా దీటుగా బదులిచ్చి విజేతగా నిలిచింది.

సర్ఫరాజ్, జురెల్, దయాల్‌కు నో చాన్స్?

- **ఇరానీ కప్ జట్టులో చోటు**

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో స్వదేశంలో రెండో టెస్టుకు ఎంపికైన భారత యువ క్రికెటర్లు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్, యశ్ దయాల్ ఈ టెస్టు ఆరంభమయ్యాక జట్టును వీడే అవకాశముంది. అక్టోబర్ 1 నుంచి 5 దాకా లక్నో వేదికగా జరగాల్సి ఉన్న ఇరానీ కప్‌లో భాగంగా ఈ ముగ్గురూ ముంబై, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్లకు ఎంపికవడమే ఇందుకు కారణం. బీసీసీఐ మంగళవారం ప్రకటించిన రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టులో జురెల్, దయాల్ చోటు దక్కించుకోగా సర్ఫరాజ్ ముంబై జట్టులో ఉన్నాడు. ఈనెల 27 నుంచి ఆరంభమయ్యే రెండో టెస్టు తుది జట్టులో గనక ఈ ముగ్గురూ ఆడకుంటే కాన్పూర్ నుంచి నేరుగా లక్నోకు చేరుకుంటారని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

రెండో రౌండ్‌కు త్రిసా-గాయత్రి జోడీ

మకావు (చైనా): భారత మూడో సీడ్ బ్యాడ్మింటన్ జోడీ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రౌండ్ చేరారు. మంగళవారం ఇక్కడ జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత జోడీ.. 15-21, 21-16, 21-14తో అకారీ సాటో, మయ టగుచి (జపాన్) ద్వయాన్ని చిత్తుచేసింది. మరో డబుల్స్ మ్యాచ్‌లో సిక్కీ రెడ్డి, రుత్విక శివానీ.. 21-15, 21-17తో చియుంగ్ యన్ యు (హాంకాంగ్), చు వింగ్ (చైనా) జోడీని ఇంటికి పంపించింది.

సత్తా చాటుతాం

మెగాటోర్నీ సన్నాహాల్లో ముందున్నాం • టీ20 వరల్డ్‌కప్‌పై హర్మన్‌ప్రీత్

ముంబై: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటుతామని భారత మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ ధీమా వ్యక్తం చేసింది. వచ్చే నెల 3వ తేదీ నుంచి యూఏఈ వేదికగా మొదలవుతున్న మెగాటోర్నీ కోసం మంగళవారం టీమ్‌ఇండియా బయల్దేరి వెళ్లింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న టీ20 ప్రపంచకప్‌ను ఈసారైనా ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న భారత్ ఆ దిశగా ముందుకెళుతున్నది. యూఏఈకి వెళ్లే ముందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్‌తో పాటు చీఫ్ కోచ్ అమోల్ మజుందార్, చీఫ్ సెలెక్టర్ నీతూ డేవిడ్ పాల్గొన్నారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్‌లో టీ20 ప్రపంచకప్ జరుగాల్సి ఉన్నా..అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా టోర్నీని యూఏఈకి మారుస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. మెగాటోర్నీలో భాగంగా భారత్ తమ తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో తలపడనుంది. 2009లో మొదలైన ఈ మెగాటోర్నీలో భారత్ ఇప్పటి వరకు ఒక్కసారే(2020) ఫైనల్ చేరుకోగా, గతేడాది సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. ఏండ్లుగా అందకుండా పోతున్న పొట్టి కప్‌ను ఈసారి ఒడిసిపట్టుకునేందుకు భారత్ తహతహలాడుతున్నది.

సన్నాహాల్లో ముందున్నాం:

టీ20 ప్రపంచకప్‌పై హర్మన్‌ప్రీత్ స్పందిస్తూ 'యూఏఈలో త్వరలో జరుగబోయే టీ20 వరల్డ్‌కప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఆసియా కప్‌లో చేదు అనుభవం తర్వాత మా లోపాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ముఖ్యంగా ఒత్తిడిని ఎదుర్కొంటూ ఎలా రాణించాలనే దాన్ని ప్రాధాన్యంగా తీసుకున్నాం. దూకుడుకు మారుపేరైనా టీ20ల్లో పరిస్థితులకు తగ్గట్లు ఆటతీరు మార్చుకోవాల్సి ఉంటుంది. గత టోర్నీలకు భిన్నంగా ఈసారి అన్ని విభాగాల్లో జట్టు సత్తాచాటుతుందన్న నమ్మకం నాకుంది. యువ క్రికెటర్లకు తోడు అనుభవజ్ఞులు ఉండటం జట్టుకు కలిసిరానుంది. జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో గత 10 రోజులుగా కఠిన శిక్షణ తీసుకున్నాం. ముఖ్యంగా ఫిట్‌నెస్, ఫీల్డింగ్‌లో మెరుగయ్యేందుకు చెమటోడ్చాం. ఇప్పటి వరకు చాలా మెగాటోర్నీలు ఆడిన అనుభవం నాకుంది. 19 ఏండ్ల వయసు నుంచి ఇప్పటి వరకు చాలా టోర్నీల్లో భాగమయ్యాను. టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ నుంచి బాగా పోటీ ఎదురయ్యే అవకాశముంది. ఐసీసీ ఈవెంట్లలో మమ్మల్ని ఎలా ఓడించాలో ఆసీస్‌కు బాగా తెలుసు. కానీ వారిని ఓడించే ఏకైక జట్టు భారత్ అన్న సంగతి వారికి కూడా తెలుసు' అని ఉంది. మజుందార్ మాట్లాడుతూ గత పది రోజులుగా ఎన్‌సీఏలో ఫిట్‌నెస్, ఫీల్డింగ్‌పై బాగా దృష్టి పెట్టామన్నాడు.

కాన్పూర్ టెస్టుకు భద్రత పెంపు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరగాల్సి ఉన్న రెండో టెస్టుకు పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసను నిరసిస్తూ 'అఖిలేష్ భారతీయ హిందు మహాసభ' ఆధ్వర్యంలో పలువురు ఆందోళనకారులు నిరసనకు దిగడంతో పాటు మ్యాచ్‌ను జరుగనివ్వబోమని హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మ్యాచ్ జరిగే గ్రీన్ పార్క్ స్టేడియానికి సమీపంలో ఆందోళనకు దిగిన ఈ గ్రూప్ సభ్యులలో 20 మందిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. అంతేగాక బంగ్లాదేశ్ జట్టుకు అదనపు భద్రతను సమకూర్చుతున్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. మంగళవారమే కాన్పూర్ చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లూ స్థానికంగా ఉన్న లాండ్‌మార్క్ హోటల్‌లో స్టే చేస్తుండగా హోటల్ వద్ద భద్రతను పెంచినట్టు కాన్పూర్ అడిషినల్ కమిషనర్ హరీష్ చందర్ తెలిపారు.

'పంత్ దూకుడుకు కళ్లెం' : కమిన్స్

ఢిల్లీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈ ఏడాది నవంబర్ నుంచి భారత్‌తో జరుగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందే ఆస్ట్రేలియా క్రికెటర్లు మైండ్ గేమ్‌కు మరింత పదును పెడుతున్నారు. ఈ మేరకు ఆసీస్ సారథి పాట్ కమిన్స్ ఓ క్రీడా చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'ప్రతి జట్టులో మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పుకునే ఆటగాళ్లు ఒకరిద్దరు ఉంటారు. పంత్ దూకుడు కూడా ఇలాగే సాగుతుంది. గత రెండు సిరీస్‌లలో అతడు ప్రభావం చూపాడు' అని అన్నాడు.

నకిలీ డాక్యుమెంట్లతో 20 లక్షలు దోపిడీ

- **చనిపోయిన వ్యక్తి పేరుతో సిమ్‌కార్డ్ సృష్టి**
- **పేమెంట్ యాప్స్‌కు లింక్ చేసి సొమ్ము స్వాహా**
- **నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు**
- **పరారీలో మరో నిందితుడు**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సైబర్‌క్రైం పోలీసులు కొత్త తరహా మోసాన్ని వెలుగులోకి తెచ్చారు. చనిపోయిన వ్యక్తి పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, సిమ్‌కార్డు పొందడం ద్వారా బ్యాంకుల నుంచి డబ్బు కొల్లగొడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి రూ.18 లక్షల నగదు, కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్ వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌కు చెందిన మహ్మమద్ సమీయుద్దీన్ ఇరిగేషన్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసి, 2013లో పదవీ విరమణ చేశాడు. ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు ఖాతాల్లో లక్షల రూపాయలు దాచుకున్న ఆయన 2022లో చనిపోయాడు. ఆ ఖాతాల్లోని సొమ్ము విషయాన్ని సమీయుద్దీన్ గతంలో తనతో కలిసి పనిచేసిన జహంగీర్, మహ్మద్ ఆసిఫ్ పాషాకు చెప్పాడు. దీంతో వారిద్దరు ఈ ఏడాది జూన్‌లో సమీయుద్దీన్ సిమ్‌కార్డును బ్లాక్ చేయించారు. ఆయన పేరుతో నకిలీ గుర్తింపుకార్డులు తయారు చేసి, కొత్త సిమ్‌కార్డు తీసుకున్నారు. దానితో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌లను యాక్సెస్ చేయడం ద్వారా సమీయుద్దీన్ ఖాతా నుంచి రూ.20 లక్షలు స్వాహా చేశారు. కాగా, సమీయుద్దీన్ సోదరి సబీహా సుల్తానా ఫోన్ నంబర్‌కు ఎస్బీఐ ఖాతాను అనుసంధానించి ఉండటంతో ఆయన ఖాతా నుంచి సొమ్ము విత్‌డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీనిపై ఆమె అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆసిఫ్ పాషాను అరెస్టు చేశారు. మరో నిందితుడు జహంగీర్ పరారీలో ఉన్నాడు.

హైదరాబాద్‌లో ఐటీ సోదాలు

బొల్లా రామకృష్ణ ఇండ్లు, కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ప్రముఖ వ్యాపారి బొల్లా రామకృష్ణకు చెందిన ఇండ్లు, కార్యాలయాల్లో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కూకట్‌పల్లి, బంజారా హిల్స్ చెక్‌పోస్ట్, మాదాపూర్, బషీర్‌బాగ్‌లో తెల్లవారు నుంచే జరిగిన ఈ సోదాల్లో 10 ఐటీ బృందాలు పాల్గొన్నాయి. కూకట్‌పల్లి రెయిన్‌బో విస్టాలోని రామకృష్ణ నివాసం, బషీర్‌బాగ్ పైగా ప్లాజాలోని ఫైనాన్స్ కంపెనీ కార్యాలయంలో అధికారులు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చే సుకున్నారు. స్టార్ పవర్ సంస్థ డైరెక్టర్ రా జేశ్ ఇంటిలోనూ సోదాలు జరిగాయి. రామకృష్ణ ఆదాయ పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఐటీ అధికారులు చెప్తున్నారు.

యూట్యూబర్ హర్షసాయిపై కేసు

- **పెళ్లి చేసుకుంటానని రూ. 2 కోట్లు తీసుకున్నాడు**
- **శారీరకంగా వాడుకున్నాడు**
- **నార్సింగి పోలీస్ స్టేషన్‌లో యువతి ఫిర్యాదు**

మణికొండ, సెప్టెంబర్ 24: ప్రముఖ యూట్యూబర్ హర్షసాయి తనను పెళ్లి చేసుకుంటానని, శారీరకంగా వాడుకొని మోసం చేశాడని ఓ యువతి మంగళవారం హైదరాబాద్ నార్సింగి పోలీసులను ఆశ్రయించింది. పేదలకు సేవ చేస్తున్నానంటూ యూట్యూబ్‌లో రీల్స్ చేస్తున్న హర్ష సాయి అనేక అరాచకాలకు పాల్పడ్డాడని ఆ యువతి ఆరోపించింది. కొన్నాళ్లుగా ప్రేమాయణం నడిపినట్టుగా నటించిన హర్షసాయి తనను పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి పలుమార్లు శారీరకంగా వాడుకుని, ఇప్పు డు తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకునేందుకంటూ తన నుంచి రూ.2 కోట్ల నగదు తీసుకున్నాడని, ఇందుకు ఆయన తండ్రి రాధాకృష్ణ కూడా కారణమని పేర్కొన్నది. కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు విచారణ చేపట్టి తదుపరి వివరాలు తెలుపుతామని చెప్పారు.

మెడికల్ అడ్మిషన్లలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిబంధనలకు అనుగుణంగా 2024-25 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్, బీడీఎస్, మెడికల్ పీజీ అడ్మిషన్లలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హైకోర్టుకు తెలియజేసింది. దీంతో ఆ హామీని రికార్డుల్లో నమోదు చేసిన హైకోర్టు.. మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు కోసం కామారెడ్డి ఎమ్మెల్యే కటిపల్లి వెంకటరమణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

- **వ్యాన్ బోల్తా.. చేపలు లూటీ**

విజయవాడ నుంచి వరంగల్ వైపు చేపల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని బస్టాండ్ వద్ద బోల్తాపడింది. రోడ్డుపై చేపలు చెల్లాచెదురుగా పడటంతో స్థానికులు, రోడ్డున వెళ్లేవారు అందినకాడికి పట్టుకెళ్లారు. దీంతో గంటన్నరపాటు ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. – మరిపెడ

బాలికపై పీఈటీ లైంగికదాడికి యత్నం

తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన

కామారెడ్డి, సెప్టెంబర్ 24: ఆరేండ్ల బాలికపై పీఈటీ అత్యాచారయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవదాన్ పాఠశాల పీఈటీ నాగరాజు.. అదే స్కూల్‌లో చదివే బాలికపై అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. భయపడిపోయిన బాలిక బడికి వెళ్లనని మారాం చేసింది. ఏమైందని తల్లిదండ్రులు అడిగితే విషయం చెప్పడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, మున్సిపల్ వైస్‌పర్సన్ ఇందుప్రియ, బాలిక తల్లిదండ్రులు, బంధువులు స్కూల్‌కు వచ్చి ఆందోళన చేశారు. అక్కడున్న అద్దాలు, వస్తువులను ధ్వంసం చేశారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఎంత చెప్పినా పట్టించుకోలేదు. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు విసిరారు. సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై రాజారాం, మరికొందరికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. పరిస్థితి చేయి దాటుతుండటంతో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి అక్కడకు చేరుకుని నిరసనకారులతో మాట్లాడి శాంతింపజేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.